

రోప్‌వేపై కాలినడకకు అనుమతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగి ఆత్రేయ గోదావరి నదిపై నిర్మించిన రోప్ వేపై కాలినడకకు అధికారులు అనుమతి ఇచ్చారు. మరమ్మతుల కారణంగా ఈ వంతెనపై రాకపోకలను అధికారులు గతంలో నిలిపివేశారు. దీంతో వంతెనకు రెండు వైపులా అడ్డుగా ఐరన్ రాడ్లు వేసి గేట్లు ఏర్పాటు చేశారు. వంతెన పై భాగంలోని తాత్కాలికంగా రేకులు వేసి వెల్డింగులు చేశారు. దీంతో ఈ వంతెనపై కాలినడకన మాత్రమే ప్రయాణం చేయాలని పంచాయతీ కార్యదర్శి విజివి.రమణ తెలిపారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అందని పౌష్టికాహారం..!

-అంగన్‌వాడీలకు సకాలంలో రాని సరుకులు
-పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితి
-ఫేస్ యాప్ ప్రభావం
-తప్పని ఆకలి కేకలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత రెండు, మూడు నెలల నుంచి పలు కేంద్రాలకు అరకొర సరుకుల మాత్రమే చేరుతున్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లతో పాటు, ఇతర సాంకేతిక సమస్యలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో సరుకులు కేంద్రాలకు చేరకపోవడంతో లబ్ధిదారుల నుంచి ఒత్తిళ్ల ఎక్కువయ్యాయని చెబుతున్నారు. మరోవైపు యాప్‌ల పని భారంతో తీవ్రస్థాయిలో సతమతమవుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు, 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. సుమారు 3,500 మంది టీచర్లు, వర్కర్లు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు బియ్యం, కందిపప్పు, ఆయిల్, చోడి పిండి, ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశెనగ చిక్కీలను ప్రభుత్వం పౌష్టికాహారంగా అందజేస్తుంది. పిల్లలకు బాల సంజీవిని కిట్లు, గుడ్లు, పాలు సరఫరా అవుతున్నాయి. మరోవైపు పోషణ అభియాన్, పేస్ యాప్‌ల వలన సాంకేతిక సమస్యలు తరచూ వస్తుండడం వల్ల సెల్ ఫోన్లు మొరాయిస్తున్నాయని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌ల భారంతో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి లబ్ధిదారులకు నెలకు రెండుసార్లు ఫేస్ యాప్ తీయాల్సి రావడంతో గంటల తరబడి లబ్ధిదారుల చుట్టూ జరగాల్సి వస్తుందంటూ తెలిపారు. పలుసార్లు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ గర్భిణులు, బాలింతలు ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రభుత్వం కొత్త సెల్ ఫోన్లు అందజేసి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సరి చేయాల్సిన అవసరం ఉందని అంగన్‌వాడీలు అధికారులకు మొరపెట్టుకుంటున్న ఫలితం లేకుండా పోతుంది.



అరకొర సరుకులే

ప్రభుత్వం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెల 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 3 కేజీలు బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు ఆయిల్ సరఫరా చేస్తున్నారు. 7 నెలలు నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు రెండున్నర కేజీల బాలామృతం ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు సోమవారం అన్నం, దోసకాయ పప్పు, మంగళవారం పులిహోర, టమాటో పప్పు, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, గురువారం అన్నం, ఆకుకూర పప్పు, శుక్రవారం అన్నం, ఆకుకూర, శనివారం వెజిటబుల్ రైస్, ఆకుకూరను మెనుగా ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్ అయిన గర్భిణులకు పూర్తి స్థాయిలో బాలసంజీవిని కిట్లు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు సర్పవరం ప్రాజెక్టు పరిధిలోని రమణయ్యపేటలోని ఒక అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 95 మంది చిన్నారులు ఉన్నారు. 50 గర్భిణులు, బాలింతలు ఉన్నారు. ఇక్కడ నేటికీ బాలామృత ప్యాకెట్లు పంపిణీ కాలేదు. ప్రతినెలా 10వ తేదీ లోపే ఇవి కేంద్రాలకు చేరుతున్నప్పటికీ గత రెండు నెలల నుంచి పూర్తిస్థాయిలో సక్రమంగా పంపిణీ కావడం లేదు. గర్భిణులు, బాలింతలకు 20 మంది మాత్రమే సరుకులు అందాయి. మిగిలిన వారికి నేటికీ సరుకులు చేరలేదు. దీంతో లబ్ధిదారులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక అంగన్‌వాడీలు అయోమయానికి గురవుతున్నారు. తుని ప్రాజెక్ట్ పరిధి రావికంపాడు సెక్టర్ తమ్మయ్యపేట అంగన్‌వాడీ కేంద్రం 2 నెలల నుండి స్టాక్ రావట్లేదు. దీని పరిధిలోనే మిగిలిన కేంద్రాలకు సరిపడా సరుకులు రావట్లేదు. గుడ్లు, పాలు, బాలామృతం అన్నీ తక్కువగా వస్తున్నాయని స్థానిక సిబ్బంది తెలిపారు. కాకినాడ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని వాకలపూడి, వలసపాకల లోని ఉన్న నాలుగు కేంద్రాలకు రెండు నెలల నుంచి పూర్తిస్థాయిలో సరుకులు పంపిణీ కావడం లేదు. బియ్యం, పప్పు, ఆయిల్ అరకొరగానే అందుతుందని స్థానిక సిబ్బంది తెలిపారు. ఇటు కాకినాడ దుమ్ములపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సైతం అరకొర సరుకులే వస్తున్నాయి. అవి కూడా సమయానికి రావడం లేదు. దీంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ 18 మంది గర్భిణులు, బాలింతలు ఉండగా 42 మంది పిల్లలు ఉన్నారు. ప్రతి నెలా నాలుగో తేదీ లోపు బాలామృతం ప్యాకెట్లు పిల్లలకు అందజేస్తుండగా 11వ తేదీ దాటినప్పటికీ నేటికీ సరుకులు చేరలేదని స్థానిక సిబ్బంది తెలిపారు. ఇలా జిల్లాలో ఉన్న పలు కేంద్రాలకు సకాలంలో సరుకులు సక్రమంగా పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఏర్పడింది. అధికారులు తక్షణమే స్పందించి పౌష్టికాహారం ఇతర సరుకులు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాంకేతిక సమస్యలు



మా వద్ద ఉన్న పాత ఫోన్లతోనే పనిచేస్తున్నాం. యాప్‌ల వలన అనేక సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. లబ్ధిదారులకు సకాలంలో పూర్తిస్థాయిలో సరుకులను అందజేయలేకపోతున్నాము. ఫేస్ యాప్ వలన అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

-రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త, కాకినాడ రూరల్

సకాలంలో అందించాలి



గత రెండు మూడు నెలల నుంచి సరుకులు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. రేషన్ అరకొరగానే వస్తుంది. లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారుల క్షేత్రస్థాయిలో ఇబ్బందులను సరిచేయాలి.

-ఎం.స్వరాజ్య విజయ, అంగన్‌వాడీ కార్యకర్త, కాకినాడ సిటీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర ప్రజాప్రతినిధులు

పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. మంగళవారం యాంకరేజ్ పోర్ట్ వద్ద జిల్లా పరిశ్రమలు, ఎపిఐఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశ్రమలు - ఉపాధి కల్పన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి, పెదఈర్లపాడు నుంచి జిల్లాలోని 4 ఎంఎస్ఇలకు వర్చువల్‌గా శంఖుస్థాపన చేశారు. అనంతరం కాకినాడ పోర్టులో ఎంఎటి మెరైన్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలను మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లిన పర్యటనల ద్వారా రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారన్నారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకం అనే విషయాన్ని గుర్తించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సిఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు ఇస్తుందన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ సిఎం, డిసిఎం మార్గదర్శకత్వంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు నూరు శాతం కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గడిచిన ఆరు నెలలుగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు ఒకటి పెండింగ్‌లో లేదన్నారు. ఇందుకు ప్రతి నెల సమావేశాలు నిర్వహించి పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపి తంగేళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధిని కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేలా వివిధ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ అమరావతికి క్వాంటం వ్యాలీ, విశాఖ పట్నణానికి ప్రసిద్ధ గూగుల్ వంటి గొప్ప సమస్థలను తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో పాటుపడుతుందన్నారు. ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో బోట్లు మరమ్మతులు, తయారీకి ఇక్కడి మత్స్యకారులు ఇతర ప్రదేశాలకు వెళ్లే వారని, ఇకపై ఆ పరిస్థితి లేకుండా బోటుయార్డును నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, తహశీల్దార్ వి.జితేంద్ర, పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర, ఎంఎటి మెరైన్ సెక్రెటరీ జెఎన్‌వి.ప్రసాద్‌రాజు, సంతోషిమాత ప్యాకింగ్ ప్రయివేట్ లిమిటెడ్ జిఎం పివి.వెంకటరత్నం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మడ అడవులను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం తూరంగి పంచాయతీ, పరిసర ప్రాంతాల్లో ఉన్న మడ అడవుల ప్రాంతాన్ని సిపిఎం బృందం ఆ పార్టీ నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు నాయకత్వంలో పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులను ప్రభుత్వం సంరక్షించాలని అన్నారు. సర్వే నంబర్ 2018లో ప్రభుత్వ డ్రెయినేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని, మడ అడవులకు వెళ్లే దారి మార్గంపై నిర్మించిన గోడలను తక్షణం తొలగించాలని కోరారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రియల్టర్లు చేపడుతున్న అక్రమ వెంచర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడ అడవుల ఆక్రమణలపై కలెక్టర్ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జరుగుతున్న ఆక్రమణలపై చర్చించేందుకు త్వరలోనే కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్లను సిపిఎం బృందం కలుస్తుందన్నారు. ఈ పర్యటనలో చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, తొట్టిపూడి రాజా, అంకం సుబ్రమణ్యం, జె.అప్పారావు, మణికంఠ పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

లక్ష్యాన్ని మించి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - కాకినాడ

ఖరీఫ్‌లో సాగులో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని లక్ష్యాన్ని మించి కొనుగోలు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా కమిటీ 5వ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. తొలుత కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి గత జూలై నెలలో జరిగిన కమిటీ 4వ సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పిఎం సూర్యఘర్ యోజన అమలు, 72 పిఎసిఎస్‌ల కంప్యూటీకరణ పూర్తిచేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేసారు. సముద్రంలోకి వధాగా పోతున్న 2 టిఎంసిల ఏలేరు జలాలను గరిష్ట స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఎంఎల్‌ఎలు చేసిన సూచనల కనుగుణంగా ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రూ.18 కోట్లు, రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో జిల్లాలోని గోదావరి కాలువలపై ఉన్న 11 స్నాన ఘట్టాల అభివృద్ధికి రూ.55 లక్షలు నిధులు వచ్చాయని, పనులు త్వరలో చేపట్టనున్నామని కలెక్టర్ వివరించారు. ఉప్పాడ, కోనపాపపేటల వద్ద సముద్రతీర కోత నివారణకు రాతి రక్షణ గోడ నిర్మాణాన్ని రూ.16 కోట్ల నిధులతో చేపట్టేలా మారిటైం బోర్డుకు ప్రతిపాదించామని ఆయన తెలిపారు. అజెండా సమీక్షలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంత్రికి వివరించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన గోను సంచెలు, కూలీలు, వాహనాలు, పిపిసి కిట్లు తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పిస్తూ నిర్ధేశించిన లక్ష్యాన్ని మించి కొనుగోళ్లు జరపాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వరుపుల సత్యప్రభ, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, జడ్‌పి మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం శశికాంత్ నగర్‌లోని సహకార శ్రీ నిలయంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా ఎన్‌విఎస్ఎస్ఆర్‌కె. దుర్గాప్రసాద్, కార్యదర్శిగా కె.ప్రతాప్‌కుమార్, కోశాధికారిగా ఎస్. రవికుమార్, సహాధ్యక్షులుగా డి.బాపిరాజు, ఉపాధ్యక్షులుగా జిఎన్‌వి.ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా పి.ఉమాశంకర్, సిహెచ్ స్వరూపరాణి, కేడర్ కార్యదర్శులుగా ఎస్‌కె.అన్సర్‌వల్లీ, ఎం.సుధీర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి.మురళీసత్యనారాయణ ప్రకటించారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టివి.ఫణిపేర్రాజు, ఉపాధ్యక్షులు పి.దుర్గాప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.



దుర్గాప్రసాద్



ప్రతాప్‌కుమార్

ఆదిత్యలో కొనసాగిన క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సౌజన్యంతో ఆదిత్య యూనివర్సిటీలో ఇన్ఫోసిస్ కంపెనీ నిర్వహించిన క్యాంపెస్ ఇంటర్వ్యూలు మంగళవారం కొనసాగాయి. ఆన్‌లైన్ పరీక్షలకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు, విశాఖపట్నం జిల్లా నుంచి 9 ఇంజనీరింగ్ కళాశాల నుంచి 2213 మంది విద్యార్థులు హాజరైనట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ప్రతినిధి డాక్టర్ డి.శ్రీనివాస్, ఇన్ఫోసిస్ కంపెనీ హెచ్‌ఆర్ మోహిత్, ఆదిత్య ప్లేసెమెంట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్ ప్రతినిధి

ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కాజులూరు

యూనియన్ బ్యాంక్ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కాజులూరు శాఖలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ డి.సురేష్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1919లో ముంబైలో జాతిపిత మహాత్మా గాంధీ ఈ బ్యాంకును ప్రారంభించారన్నారు. ప్రస్తుతం 8,600 శాఖలతో దేశ, విదేశాల్లో విస్తరించిందన్నారు. 74 వేల ఉద్యోగులతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులతో 12.30 లక్షల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లతో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలందించడానికి యూనియన్ బ్యాంక్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ మెహర్, మంత్రి మనోజ్, నజర్, రామకృష్ణ, శ్రీనివాస మూర్తి, ప్రదీప్ కుమార్, బ్యాంక్ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు, వినియోగదారులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్ సురేష్, ఉద్యోగులు

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాలేజీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఇంటర్ సెకండ్ విద్యార్థి శంకర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. న్యాయం కోసం విద్యార్థి కుటుంబ సభ్యులు చేస్తున్న ధర్నాకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, నగర కార్యదర్శి పి.సత్యం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని లక్ష్మీనారాయణ నగర్‌లో సోమవారం జరిగిన కళాశాల బస్సు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి మృతి చెందడం బాధాకరమని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల బస్సులు విద్యార్థుల ప్రాణాల బలి తీసుకుంటున్న అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యాసంస్థలు నడిపే బస్సుల ఫిట్నెస్‌పై ప్రభుత్వం పగడ్బందీగా తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు కళాశాలకు పెట్టుకునేటువంటి బస్సు ఏజెన్సీలు అర్హత ఉందో లేదో చూసి నిర్వహించాలని అన్నారు. మృతిని కుటుంబానికి ప్రభుత్వం తగిన రీతిలో న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహకార కార్యదర్శి సిహెచ్. లోవరాజు, జిల్లా కమిటీ సభ్యులు పి.జైరామ్ పాల్గొన్నారు.



కుటుంబీకుల ఆందోళనకు మద్దతు ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా యుబిఐ వార్షికోత్సవం


ప్రజాశక్తి - ఏలేశ్వరం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వార్షికోత్సవం స్థానిక బ్రాంచ్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త యువిఆర్ గ్రూప్ ఛైర్మన్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుబిఐ పొదుపు ఖాతాలను నిర్వహించడంలోనూ, సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు అందించడంలోనూ మంచి సేవలు అందిస్తుదని అన్నారు. గృహ, వాహన, ఇతర రుణాలకు మిగిలిన బ్యాంకులతో పోలిస్తే యుబిఐలో వడ్డీ శాతం తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శివనరసింహారెడ్డి, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, పూర కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న గ్రూప్ ఛైర్మన్ వెంకట్రావు

కార్టూ'నిజం'



మండల కమిటీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి మండల కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. మంగళవారం స్థానిక సూర్య ఫంక్షన్ హాల్‌లో టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షునిగా బడుగు శ్రీకాంత్, మండల కమిటీ అధ్యక్షునిగా ముసిరెడ్డి శ్రీరాములు, క్లస్టర్స్, వార్డు కమిటీ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో జరిగింది. తొలుత టిడిపి జెండాను ఎంఎల్‌ఎ ఆవిష్కరించారు. కేక్ కటింగ్ చేసి కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా టిడిపి పని చేస్తుందని అన్నారు. ఎవరైతే ప్రజల్లో ఉంటారో వాళ్ళకే పదవులు దక్కుతాయన్నారు. పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ మాట్లాడుతూ బిసిలకు అండగా ఉన్న పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క టిడిపి మాత్రమేనని అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, నియోజవర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీశ్, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, పైణ్ణి శ్రీనివాసరావు, తోటకూర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కమిటీ నూతన అధ్యక్షులతో ప్రమాణం చేపిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం మీనామాధురి, పీడీలు

స్కూల్ గేమ్స్‌లో కట్టమూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్ 17, అండర్ 14 బాలురు కబడ్డీ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని పాఠశాల హెచ్ఎం మీనామాధురి తెలిపారు. అలాగే అండర్ 14 బాలురు వాలీబాల్ పోటీలో ప్రథమ స్థానం, అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలో ప్రథమ స్థానం సాధించారన్నారు. 15 మంది విద్యార్థులు డివిజన్ స్థాయికి, పదిమంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ఆమె తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలో 35వ సబ్ జూనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే జిల్లా జట్టుకు హై స్కూల్ విద్యార్థులు ఎం.చంద్రిక, పి.శ్రీలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం హెచ్ఎం మీనామాధురి, పీడీలు వరాసాధనం, వీరబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

'నిబద్ధత గల నాయకుడు ముద్రగడ'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాజకీయాల్లో నిబద్ధత గల నాయకుడు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అని మాజీ ఎంపి వంగా గీతా అన్నారు. మంగళవారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క మెడికల్ కాలేజ్ తీసుకురాకుండా వైఎస్.జగన్ తెచ్చిన కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ముద్రగడతో మాట్లాడుతున్న వంగా గీత

ఎట్టకేలకు నిదానందొడ్డి రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కలవల దొడ్డి నుంచి నిదానందొడ్డికి వెళ్లే రోడ్డు ఛిద్రం కావడంతో ప్రయాణించడానికి ఇబ్బందికరంగా ఉండడంతో ఉపాధి హామీ చట్టం నిధులు రూ.40 లక్షలతో తారు రోడ్డును వేశారు. ఈ రోడ్డు నిర్మాణం పట్ల గ్రామ సర్పంచ్ కర్రి చిన్నారావు సంతోషాన్ని వెలుబుచ్చారు.

నేరాలు ఘోరాలు


గంజాయితో పట్టుబడ్డ వ్యక్తితో పోలీసులు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆర్‌పిఎస్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్‌ఐ వాసు ఆధ్వర్యంలో ట్రైన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిట్టు కుమార్ యాదవ్ అనే యువకుడు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి బుధవారం విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.

బస్సు చక్రం కింద పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు బస్సు చక్రం కింద పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వెలిచేరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెలిచేరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి రాజు, సురేఖ దంపతులకు కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉదయ పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో ఎల్‌కెజి చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించేందుకు తల్లి సురేఖ రోడ్డు వద్దకు వచ్చింది. ఆమె కుమార్తె హారిణి వరలక్ష్మి తల్లి వెనకాల వచ్చింది. కుమార్తె వచ్చిన విషయం తల్లి గమనించలేదు. కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించడంతో బస్సు ముందుకు కదిలింది. వెనుక వైపు హారిణి ఉన్నట్లు డ్రైవర్ గుర్తించకపోవడంతో బస్సు ఎడమవైపు వెనుక భాగం చక్రం కింద చిన్నారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో చిన్నారి హారిణి అక్కడికక్కడే మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రాము సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులో తీసుకుని బస్సును పోలీస్ స్టేషన్ తరలించారు. హారిణి తల్లి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం కోడెద రామాలయం సమీపంలో బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన బోణం సూర్యనారాయణ(70) రాజానగరంలోని బంధువులను చూసేందుకు సోమవారం వచ్చాడు. తిరిగి ఇంటికి నడిచి వెళుతుండగా రాపుల చెరువు గట్టు కోడెద రామాలయం సమీపంలో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ తలకు బలమైన గాయమైంది. వెంటనే అతన్ని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ జివివి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడలో లారీ దగ్ధం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలోని ప్రతాప్ నగర్- సామర్లకోట రోడ్డు జెడ్ బ్రిడ్జి సమీపంలో లారీ దగ్ధమైంది. హైదరాబాదు నుంచి కాకినాడకు వెళ్తున్న లారీలో హోర్డింగ్ ఏర్పాటుకు సంబంధించి హైడ్రోజన్ పరికరాలలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మంగళవారం రాత్రి చిరునామాను అడిగేందుకు డ్రైవర్ బషీర్, క్లీనర్ బాలరాజు లారీ నుంచి దిగిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. లారీ నుంచి వచ్చిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. అయితే అప్పటికే ముందు వెనుక భాగం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణను అగ్నిమాపక, పోలీస్ అధికారులు చేస్తున్నారు.

ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్య అనేది ప్రతి ఒక్కరి జన్మహక్కు అని,దేశంలో విద్యా వ్యవస్థను స్థాపించిన వ్యక్తి 'మౌలానా అబుల్ కలామ్ ఆజాద్" అని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ.. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి భారత ప్రభుత్వంలో దాదాపు 11 ఏళ్ల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి అన్నారు. ఆయన పుట్టిన రోజును "జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బంది, డిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అబుల్‌కలామ్ ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న డిఇఒ

యానాం వార్తలు


సరుకులు అందిస్తున్న నాయకులు

నిత్యావసర సరుకుల అందజేత

ప్రజాశక్తి - యానాం

స్థానిక దొమ్మేటి పేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, ఇన్‌ఛార్జ్ కాటంశెట్టి రామూర్తి మంగళవారం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థాలను ప్రధాన మురికి కాలవలోకి వదలడంతో దుర్వాసన వస్తుందన్నారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థాలను పైప్ లైన్ ద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుకోటి ఆదిమూర్తి, విసికె పార్టీ నాయకులు మెల్లం చిన్న, పైడికొండల రాజబాబు, వెంకన్న బాబు, సింహాద్రి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ అంకిత్‌కుఆమర్, ఎస్‌పి వరదరాజన్, ఇతరులు

మౌలానాకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

సమాచార శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక ఫెర్రీ రోడ్డు సిరాజ్ గార్డెన్‌లో ఆయన విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఒ అంకిత్‌కుమార్, ఎస్‌పి వరదరాజన్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, హంసాని రామ లక్ష్మణుడు, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో యానాం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం సేవించరాదని, సెల్ ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, ఇన్సూరెన్స్ విధిగా చేయించాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, నూతన మోటార్ వెహికల్ ఆక్ట్ రూల్స్ ప్రకారం విధులు సక్రమంగా పాటించాలని, ఆటో డ్రైవర్స్ యూనిఫారం ధరించాలని తదితర అంశాలపై డ్రైవర్లకు సూచించారు. ఇద్దరు బెస్ట్ డ్రైవర్లను ఎస్‌పి వరదరాజన్, ఎస్‌హెచ్ఒ పుణీత్‌రాజ్ సత్కరించారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట వాటర్ వర్క్సులో నిర్వహణ, వివిధ మరమ్మతు పనుల నిమిత్తం బుధవారం సాయంత్రం కనకాలపేట, గణపతి నగర్, యుకెవి.నగర్, భీమ్ నగర్, పెద్దిరెడ్డి గార్డెన్స్, కోన గార్డెన్స్, ఫ్రాన్స్ తిప్ప ఏరియాలలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. నీటిని వృధా చేయరాదని సూచించారు.

మున్సిపల్ కమిషనర్‌గా 'అద్దంకి'

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అద్దంకి మల్లికార్జునరావును మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావును పలువురు అభినందించారు.

కేసుల పెండింగ్ వాస్తవమే : ఐజి

ప్రజాశక్తి - జగ్గంపేట

కేసులు పెండింగ్‌లో ఉండటం వాస్తవమేనని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జగ్గంపేట సర్కిల్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అలాగే సర్కిల్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన సంక్షేమ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో గడిచిన ఏడాదిలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు చాలా తగ్గయన్నారు. రాత్రి సమయాల్లో అక్కడక్కడ జరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఒకచోట నేరం చేసిన వారు మరొక చోట ఉంటే గతంలో తెలిసేది కాదని, రేంజ్ పరిధిలో ఎక్కడ నేరం చేసిన తెలిసే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. విచారణను పూర్తి చేయకుండా చాలా కేసులను పెండింగ్‌లో పెడుతున్నారని అటువంటి కేసులను పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్‌పి బిందుమాధవ్, డిఎస్‌పి శ్రీహరి రాజు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఐజి

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు, పిఠాపురం

ప్రాణ రక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ సూచించారు. మంగళవారం జార్జిపేట వై జంక్షన్ ప్రాంతంలోని చెక్ పోస్ట్ వద్ద వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలలో 90 శాతం ప్రాణ రక్షణ ఉంటుందన్నారు. వాహన చోదకులు పెడచెవిన పెడితే భారీ స్థాయిలో జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే పిఠాపురం రైల్వే స్టేషన్ రోడ్‌లో ఆటో డ్రైవర్లకు పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్ ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలు, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


తాళ్లరేవులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నిరుద్యోగ యువతకు ఉపాధి

ప్రజాశక్తి - పెద్దాపురం

పారిశ్రామికీకరణ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎడిబి రోడ్డులోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద పారిశ్రామిక వేత్తలు, నిరుద్యోగ యువతతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నిరంతరాయంగా పారిశ్రామిక అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సిఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. తొలుత ఎంఎస్ఎంఇ పార్కును వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కుక్కల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కెటి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎన్‌టిఆర్ నగర్ సమీపంలోని ఎబిసి సెంటర్‌ను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణతో కలిసి ఆయన పరిశీలించారు. రోజువారీగా ఎన్ని కుక్కలకు ఎబిసి ఆపరేషన్లు జరుగుతున్నాయి? షెల్టర్‌లో ఎన్ని కుక్కలు ఉన్నాయన్న వివరాలను స్వయంగా పరిశీలించారు. ఎబిసి కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. కేంద్రాన్ని మరింతగా విస్తరించాలని, సదుపాయాల పెంపుపై దీష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కల సంఖ్యను తగ్గించడంలో ఎబిసి ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ మరిన్ని ఆపరేషన్లు చేయడానికి అవసరమైన వసతులను కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో స్నాప్ హెడ్ శ్యామ్, డిఇ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధర్మాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎబిసి సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట

కెనాల్ రోడ్డులో జరుగుతున్న పనుల నిమిత్తం ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కెనాల్ రోడ్డులోని ముత్యాలమ్మ రాయి సమీపంలో ట్రాఫిక్ బోర్డులు పెట్టి ట్రాఫిక్‌ను మళ్లించారు. సామర్లకోట నుంచి వెళ్లే వాహనాలు ఎడిబి రోడ్డులోని అచ్చంపేట మార్గం ద్వారా ప్రయాణించాల్సి ఉంటుందని, కాకినాడ నుంచి సామర్లకోట వైపు వచ్చే వాహనాలు అచ్చంపేట మార్గం ద్వారానే రావాలని పోలీసులు తెలిపారు. ఈ మార్పులను గమనించి ప్రయాణికులు సహకరించాలని పోలీసులు కోరారు.


బందోబస్తు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కార్టూన్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కార్టూన్ పోటీలు నిర్వహించనున్నట్లు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలు, మండలాల పరిధిలోని విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు తమ కార్టూన్లను ఈనెల 12 వ తేదీ సాయంత్రానికి వాట్సాప్ నెంబర్లు 9989596865, 9848205006, 9000695301లకు పంపించాలని, లేదా నేరుగా అందజేయాలని సూచించారు. విజేతలకు ఈనెల 14వ తేదీన యాసలపు సూర్యారావు భవనంలో జరిగే సభలో బహుమతులు అందజేస్తారన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్.వెంకట్రావు మంగళ వారం ప్రకటనలో తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించడం జరుగుతుం దన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం మొదలు బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహణ, సాంస్కృతిక కార్య క్రమాలు, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమకారుల సంస్కరణ సభలు నిర్వహిస్తారని అన్నారు. ఈ వారోత్సవాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

యాత్రికులకు 'లయన్స్' ప్రసాద వితరణ

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన యాత్రికులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాస్, మద్దిరాల శివనాగకృష్ణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నాయకులు చిత్తలూరి వీర్రాజు, మేక శీను, కానుబోయిన విజయకృష్ణ, మురళీకృష్ణ, చిత్తలూరి శ్రీదేవి, గుండు కళ, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ దిండి గ్రామంలోని సర్వే నెంబర్ 298లోని 0.63 సెంట్ల పంచాయితీ తాగునీటి చెరువు ఆక్రమణను అడ్డుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ తెలిపారు. చెరువును ఆక్రమించి జెసిబితో పూడ్చివేస్తుండగా జెసిబి డ్రైవర్ గుబ్బల మహేష్‌ని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని ఆయన అన్నారు. ఈ మేరకు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద అమరవీరుల సంతాప సభ జరిగింది. తొలుత అమరవీరులకు నివాళులర్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు పిడిఎస్‌యు (వి) రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను, పేద ప్రజలను చిత్రహింసలకు గురిచేస్తున్నాయని అన్నారు. సమాజంలో ప్రజలందరూ సమానంగా బతకాలని, అసమానతలు పోవాలని, దున్నే వానికి భూమి దక్కాలని జరుగుతున్న పోరాటాల్లో అనేకమంది అమరవీరులు తమ అమూల్యమైన ప్రాణాలను తునప్రాయంగా అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, మడికి సత్యం, కె.రామలింగేశ్వరరావు, ఎల్లే సత్తిబాబు, డొక్కులూరి సంగీత, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన

అసెస్మెంట్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

అర్హులైన ప్రతి ఒక్కరూ అసెస్మెంట్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఆర్‌జెడి జి.నాగమణి సూచించారు. మంగళవారం స్థానిక పెగోడ నగరపాలక పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అసెస్మెంట్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే అసెస్మెంట్ క్యాంపుల ద్వారా పిల్లలకు అవసరమయ్యే ఉపకరణాలు సూచించబడతాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి వేణుగోపాలరావు, ఐఇ కోఆర్డినేటర్ గిరిప్రసాద్, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతన్‌కుమార్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ మధురిమ, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రవీణకుమారి, ఐఇడిఎస్ఎస్ స్కూల్ అసిస్టెంట్లు, ఐఇఆర్‌పి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ


గండేపల్లిలో చిత్రాన్ని చిత్రీకరిస్తున్న యూనిట్ బృందం

తాళ్లూరులో సినీ సందడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు గ్రామంలో శివారుణ జీవన్ స్వామి మఠం వద్ద జాతర సినిమా చిత్రీకరణ షూటింగ్ సందర్భంగా సందడి నెలకొంది. షూటింగ్‌ను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల యువకులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం మాట్లాడుతూ కన్నడ హీరో చందు, హీరోయిన్ సునీ నటిస్తున్న చిత్రానికి డైరెక్టర్‌గా ప్రభువు ఈ చిత్రాన్ని తెరపైకి ఎక్కిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో చరణ్‌రాజ్, బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్, జెమిని సురేష్, జబర్దస్త్ ఆర్టిస్టులు సతీష్, అశోక్ నటిస్తున్నారని తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న సంస్థ ప్రతినిధులు

రాష్ట్ర స్థాయి పోటీలకు నారాయణ విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ పెయింటింగ్ కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు నారాయణ ఇ-టెక్నో, ఒలింపియాడ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి. గగన ఎంపిక అయ్యిందని ప్రిన్సిపల్ రవికిషోర్ మంగళవారం తెలిపారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమాదేవి, ఆర్ అండ్ డి హెడ్ రవికుమార్, ఎజిఎం రాఘవేంద్రరావు, కోర్డినేటర్ సుంకర మూర్తి, అకడమిక్ డీన్ సునీల్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇన్‌ఛార్జ్ నిస్సి అభినందనలు తెలిపారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

వైద్య కళాశాలలను ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి లీగల్ విభాగానికి చెందిన న్యాయవాదులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రయివేటీకేరించడం వల్ల అట్టడుగు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ న్యాయవాదులు పి.మృత్యుంజయరావు, రాగం కామేశ్వర రావు, పిట్టా సుగుణరావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలానాకు ఘన నివాళి

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని పిఎం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఎస్‌పి

సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో దళిత మహిళలపై పెత్తందారులు దాడికి పాల్పడిన ప్రదేశాన్ని ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్, సిఐ జి.శ్రీనివాస్ పరిశీలించారు. భూ వివాదంపై దళిత మహిళలను విచక్షణ రహితంగా జ్యోతులు వీరబాబు, అతని అనుచరులు దాడి చేసి కులం పేరుతో దూషించి గాయపరిచారు. దీనిపై పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా చేబ్రోలులో దాడి జరిగిన సంఘటన ప్రదేశాన్ని అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.